చార్మినార్‌లో చతుర్ముఖ పోటీ

- మజ్లిస్‌కు కంచుకోటగా చార్మినార్
- కంచుకోటలో పాగా కోసం బీజేపీ, కాంగ్రెస్ పోటీ
- ఉనికి కోసం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ


మీర్ జుల్ఫీకర్ అలీ, మజ్లిస్ పార్టీ


మెఘారాణి, బీజేపీ


మహ్మద్ ముజీబుల్లా షరీఫ్, కాంగ్రెస్


మహ్మద్ సలావుద్దీన్ లోధీ, బీఆర్ఎస్

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని విస్తృతం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు మజ్లిస్ పార్టీతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మజ్లిస్ పార్టీకి చార్మినార్ నియోజకవర్గం కంచుకోటగా ఉంది. ఈసారి జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు అటు బీజేపీ..ఇటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మజ్లిస్ పార్టీకి ధీటుగా తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మేయర్ మీర్ జుల్ఫీకర్ అలీ ఎన్నికల బరిలో ఉండగా..బీజేపీ నుంచి మెఘారాణి, కాంగ్రెస్ పార్టీ నుంచి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ పోటీ చేస్తున్నారు.

అన్ని డివిజన్లలో మజ్లిస్ కార్పొరేటర్లు..

ఈసారి చార్మినార్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు టికెట్ లభించ లేదు. ఆయన స్థానంలో మాజీ మేయర్ మీర్ జుల్ఫీకర్ అలీకి స్థానం దక్కింది. స్థానికంగా నివాసం ఉండడంతో పాటు గత అనుభవం దృష్ట్యా ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. చార్మినార్ నియోజకవర్గంలోని ఘాన్సీబజార్, పత్తర్‌గట్టి, మొఘల్‌పురా, పురానాపూల్, శాలిబండ తదితర ఐదు డివిజన్లలో మజ్లిస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లుగా కొనసాగుతున్నారు. ఈ డివిజన్ల పరిధిలోని ఓటర్లందరినీ సంబంధిత కార్పొరేటర్లు క్రమం తప్పకుండా కలుస్తూ ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేయాలని కోరుతున్నారు.

ఘాన్సీబజార్ నుంచి..

నియోజకవర్గంలోని ఇరువర్గాల ఓటర్లను తమకు మద్దతుగా చేసుకోవడంలో బీజేపీ అభ్యర్థి మెఘారాణి అహర్నిషలు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీకి ఘాన్సీబజార్ డివిజన్ అండగా ఉంది. ఇక్కడ బీజేపీ నాయకురాళ్లు, కార్యకర్తలు, నాయకులు కొనసాగుతున్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో తమకే ఓట్లు పడే విధంగా నిరంతరం శ్రమిస్తున్నారు. కాగా, ఇదే డివిజన్‌లో కొంత మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పురానాపూల్ డివిజన్‌లో సైతం ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు.

విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం..

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ అన్ని స్థాయిల నాయకులను, కార్యకర్తలను పొగేసి తన గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలోని మత పెద్దలతో పాటు స్థానిక నాయకులను కలిసి వారి మద్దతు తీసుకున్నారు. ఇప్పటికే టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలీ మస్కతీ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

ఉనికి కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్..

బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ప్రచారంలో దూసుకుపోతున్నప్పటికీ.. మజ్లిస్‌తో లోపాయికారి ఒప్పందం ఉండడంతో చార్మినార్‌లో తమ పార్టీ ఉనికి కోల్పోకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థితో స్థానికంగా కొంత మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలతో మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఏకంగా అభ్యర్థిని మార్చాలంటూ సమావేశాలు నిర్వహించి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. వీటన్నింటిని పక్కన పెట్టిన ఆయన పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

జంగ్ 2023 తెలంగాణ

గోమాత రక్షణకు యుగ తులసి పార్టీని గెలిపించాలి

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గం అభివృద్ధి కోసం రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని యుగ తులసి పార్టీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ఆడాల కరుణ కోరారు. లలితాబాగ్‌లో మంగళవారం ఆమె మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని యుగ తులసి పార్టీ పోరాడుతుందన్నారు. మహిళగా బరిలోకి దిగిన తనను గెలిపిస్తే అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు.

బీజేపీకి పట్టం కట్టాలి



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట అభివృద్ధికి అడ్డంకిగా మారిన ఎంఐఎంను ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ అభ్యర్థి కౌడీ మహేందర్ అన్నారు. ఉప్పుగూడ, సాయిబాబానగర్, అరుంధతి కాలనీలలో మంగళవారం ఆయన ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హయాంలోనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు.

బీఆర్ఎస్ వెంటే మైనార్టీలు


చింతలబస్తీలో దోశ వేస్తున్న సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్

నాంపల్లి: బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం రెడ్‌హిల్స్ డివిజన్‌లోని చింతలబస్తీలో ఓ హోటల్‌లో మసాలా దోశను వేసి అందరిని ఆకట్టుకున్నారు. వీర్‌నగర్, శ్యామ్‌రావునగర్ కాలనీ, చింతలబస్తీ, అంబేడ్కర్‌నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మతతత్వ రాజకీయాలు చేస్తున్నాయని చెప్పారు. ముస్లిం మైనార్టీలందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని తెలిపారు.

బీజేపీని ఓడించండి


హిందీనగర్‌లో ప్రచారం చేస్తున్న చలపతిరావు, ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: మతం పేరుతో ఓట్లు దండుకునే బీజేపీని ఓడించాలని రాష్ట్ర బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చలపతిరావు, బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పదేళ్లుగా గోషామహల్‌లో బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని వారు ఆరోపించారు. మంగళవారం జాంబాగ్ పరిధిలోని హిందీనగర్, తోప్‌ఖానా, బాలయ్యబాడ, పోలీస్‌క్వార్టర్స్ ప్రాంతాల్లో వారు పర్యటించి కేసీఆర్ ప్రభుత్వ పథకాలను వివరిసూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాబోతుందని, గోషామహల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే గోషామహల్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ ఎస్.ధన్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్ ముఖేష్ ముదిరాజ్, నరేందర్‌యదవ్, అనిత, ఆర్‌వీ. మహేందర్ కుమార్ పాల్గొన్నారు.

గోషామహల్‌లో రాజాసింగ్‌ను ఓడిస్తాం


మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్, చిత్రంలో మోతే శోభన్ రెడ్డి, సంతోష్ గుప్తా, మమతా గుప్తా

సుల్తాన్‌బజార్: గోషామహల్‌లో రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు దాసోజు శ్రవణ్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి మోతే శోభన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్‌లో పదేళ్లుగా ఎమ్మెల్యే రాజాసింగ్ చేసింది ఏమీ లేదన్నారు. జీహెచ్ఎంసీని తన గుప్పెట్లో పెట్టుకుని తన అనుచరులతో వసూళ్ల పర్వం కొనసాగించి కోట్లకు పడగలెత్తిన రాజాసింగ్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 90 శాతం రాజాసింగ్‌కు వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ గెలుపు ఎంతో సునాయాసంగా మారిందని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి గోషామహల్‌లో తిరుగులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మమతా సంతోష్ గుప్తా, దిలీప్ ఘనాటే, రాంచందర్ రాజు, నాగమణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'జియాగూడలో బీజేపీకి మంచి పట్టు ఉంది'


కురుమబస్తీలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

జియాగూడ: జియాగూడ డివిజన్‌లో బీజేపీకి మంచి పట్టు ఉందని ఆ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం జియాగూడలోని ఇక్బాల్‌గంజ్, భీంనగర్, లక్ష్మీనర్సింహానగర్, కురుమ బస్తీ, జియాగూడ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు.

అన్ని రంగాల్లో తెలంగాణ టాప్


ధూల్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న జగన్ మోహన్‌రావు, ముఖేష్ సింగ్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రం ఐటీ, టెక్నాలజీ, టూరిజంతో పాటు అన్ని రంగాల్లో దేశంలోనే టాప్‌గా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, ప్రగతిని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎంతో గర్వకారణమన్నారు. ధూల్‌పేట్, టక్కరివాడి తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్ రావుతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు

'నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా'


ప్రచారంలో కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజరీ

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజరీ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ కేవలం తమ అవసరాల కోసమే రాష్ట్రంలో అధికార పార్టీలకు సలామ్‌లు చేయడం అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలతో అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అమ్జద్‌ఖాన్, సర్వర్, అబ్దుల్లా తదితరులున్నారు.

బీజేపీని గెలిపిస్తే ఎంఐఎం అక్రమాలకు అడ్డుకట్ట


మేనిఫెస్టోను విడుదల చేస్తున్న జేఎల్ రాహుల్‌చంద్ర, చిత్రంలో రాములు, భుజందర్

నాంపల్లి/గోల్కొండ: మజ్లిస్ పార్టీ నియోజకవర్గంలో అభివృద్ధి చేసిందేమి లేదని నాంపల్లి నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేఎల్ రాహుల్‌చంద్ర అన్నారు. మంగళవారం దత్తాత్రేయనగర్‌కాలనీలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో మేనిఫెస్టో విడుదల జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జేఎల్ రాహుల్‌చంద్ర మాట్లాడుతూ..బీజేపీని గెలిపిస్తే ఎంఐఎం అక్రమాలు, అరాచకాలు, భూకబ్జాలకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. భోజగుట్ట, మాన్గార్ బస్తీలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం రెండు దొందూ దొందేనని, రెండు పార్టీలు నేరస్తులను బరిలోకి దింపారని ఆరోపించారు. కేంద్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఎంఐఎంకు ఏజెంటని ఆరోపించారు. రాజశేఖర్‌రెడ్డి, సందీప్ సాయి, భుజందర్, కొల్లూరి పవన్, మధు పాల్గొన్నారు.

చార్మినార్‌లో పురంధేశ్వరి ప్రచారం



చార్మినార్: ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మంగళవారం చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణితో కలిసి చార్మినార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన మహిళా అభ్యర్థి మెఘారాణిని ఈ ఎన్నికలలో తప్పనిసరిగా గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఆమె మాట్లాడుతూ.. హైకోర్టు న్యాయవాది అయిన మెఘారాణి మీ అందరికీ సుపరిచితమేనని..అందుకే ఉన్నత విలువలు కలిగిన ఆమెను గెలిపించాలని కోరారు.

అన్నివేళలా అందుబాటులో ఉంటా: కౌసర్


కౌసర్‌ను సన్మానిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: ప్రజా సంక్షేమం మజ్లిస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆయనను సన్మానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. పదేళ్లుగా కార్వాన్ ఎమ్మెల్యేగా ఉన్న తాను ఒక్కరోజు కూడా ప్రజల మధ్యకు వెళ్లని రోజు లేదని, ప్రజాభిమానంతో ఎన్నికైన తాను ఎప్పటికి వారికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆరూన్‌ఫరాన్, బద్రుద్దీన్, ఖాలేద్ ఆలీ ఖాన్, షకీల్ ఆలీఖాన్ తదితరులున్నారు.

జోరుగా మజ్లిస్ పార్టీ ప్రచారం



చార్మినార్: బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముబీన్ విజయం కోసం దూద్‌బౌలీకి చెందిన మజ్లిస్ పార్టీ యువజన నాయకుడు ఆర్.దీపేష్ రాజ్ వర్మ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించి అభ్యర్థికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంచి పెడుతూ మహ్మద్ ముబీన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

'బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు'


ఎన్నికల ప్రచారంలో కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన అర్హులు ఎందరో ఉన్నారని, సెక్యూలర్ విధానాలతో తెలంగాణను మేటి రాష్ట్రంగా తీర్చిదిద్దడం కేవలం కేసీఆర్‌కే సాధ్యమని ఆయన అన్నారు. ఈసారి కార్వాన్ నుంచి తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

'ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే'


ప్రచారంలో మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: తాము మజ్లిస్ పార్టీకి ధీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని.. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు తనకే ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చార్మినార్ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారలో భాగంగా ఆయన తన అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం పత్తర్‌గట్టి డివిజన్‌లోని నూర్‌ఖాన్ బజార్, కాలికబర్, ఉస్మాన్‌పురా, బారాగల్లీ, పురానీహవేలీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మహ్మద్ సైఫుద్దీన్ పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీజేపీ ఓటమి ఖాయం


ప్రచారం చేస్తున్న దామోదర్‌గుప్తా

అబిడ్స్: ప్రజల స్పందన చూస్తుంటే గోషామహల్‌లో బీజేపీ ఓటమి చెందడం ఖాయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు అన్నివర్గాల ప్రజల మద్దతు పూర్తిగా లభిస్తుందన్నారు. మంగళవారం మంగళ్‌హాట్ పరిధిలోని మంగళ్‌హాట్ గుఫానగర్, ఇందిరానగర్, వీరన్నగుట్ట ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, ఉమాదేవి వ్యాస్‌తో కలిసి ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. అనంతరం చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..పదేళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలంతా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పరమేశ్వరీ సింగ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాదేవి వ్యాస్, మనోహర్ గైక్వాడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పులిపాటి రాజేశ్ కుమార్

బహదూర్‌పురా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రామ్నాస్‌పురా డివిజన్‌లోని ఐటీఐ, మోచీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ, తనకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు.

ఈసారి రాష్ట్రంలో కమల వికాసం ఖాయం


కార్వాన్‌లో ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్

గోల్కొండ: బీజేపీ గెలుపు అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి రాష్ట్రంలో కమల వికాసం ఖాయమని అన్నారు. తెలంగాణ నుంచి బీఆర్ఎస్‌ను పారదోలేందుకు రాష్ట్ర ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. బీజేపీ అగ్రనాయకుల ఎన్నికల సభలకు తరలివస్తున్న ప్రజావాహిణి దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ అవినీతి పాలనతో విసుగెత్తిపోయారని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. సునీల్‌యాదవ్, డిజ్వర్‌సింగ్, యోగ్‌నాథ్‌సింగ్ తదితరులున్నారు.

అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డబీర్‌పురా: డబీర్‌పురా సెయింట్ మారియం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు 61వ జాతీయ రోలర్ హాకీ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కోసం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.క్యూ.షిరాజ్ తెలిపారు. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి మహ్మద్ సర్ఫరాజ్, 3వ తరగతి విద్యార్థి మహమ్మద్ సైఫ్‌లు ఎంపికయ్యారన్నారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, రోల్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 14న పంజాబ్ ఛండీఘర్‌లో నిర్వహించనున్న 61వ జాతీయ రోలర్ హాకీ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు.

బాలప్రియ అవార్డుల ప్రదానం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలల సాహితీ సాంస్కృతి సంస్థ బాల గోకులం దశమ వార్షికోత్సవం మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలలకు బాలప్రియ అవార్డులు, రచయిత్రి ఎ.వెంకట సుబ్బలక్ష్మి అనువాదించిన 'తొమ్మిది చిన్నారి పక్షులు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..చిన్నారులను ప్రోత్సహించేందుకు అవార్డులను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య బాల పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మీ, కేంద్ర సాహిత్య బాల పురస్కార గ్రహీత దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జుల్ఫీకర్ అలీని గెలిపించాలి



దూద్‌బౌలి: చార్మినార్ నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీ విజయం ఖాయమని పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీతో కలిసి డివిజన్‌లోని పలు బస్తీలలో పాదయాత్ర నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ఈ ఎన్నికలలో మీర్ జుల్ఫీకర్ అలీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చార్మినార్ నియోజక వర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోట అని.. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్ జైన్, రహీం, అంజద్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి ఒక్క అవకాశం ఇవ్వండి


ప్రచారంలో చేస్తున్న రాంరెడ్డి

చాంద్రాయణగుట్ట: తెలంగాణ ఉద్యమకారుడికి అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. రాజన్నబావి, శివాజీనగర్‌లలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, దళిత బంధు, రైతు, బీసీ, మైనార్టీ బంధులతో పేద ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వీరేందర్ బాబు యాదవ్

గౌలిపురా: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తనను ఆశీర్వదించి ప్రజలు గెలిపించాలని యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేందర్ బాబుయాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మితో కలిసి శ్రీరాంనగర్ కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కమలం గుర్తుకే ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఎ.శివచంద్రగిరి, నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, భానుప్రకాశ్, పి.రాజేశ్వర్ రావు, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, స్వప్న పాల్గొన్నారు.

పదేళ్లుగా ప్రజలను మోసం చేసిన రాజాసింగ్


ప్రచారం నిర్వహిస్తున్న నందకిశోర్ వ్యాస్

అబిడ్స్: పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా ప్రజలను ఆయన మోసం చేశారని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ ఆరోపించారు. ప్రజలను అన్ని విధాల వేధించడమే రాజాసింగ్ కర్తవ్యమన్నారు. మంగళవారం గోషామహల్ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ఇన్‌చార్జ్ ఛలపతిరావుతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ..ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపిస్తే 24 గంటల పాటు గోషామహల్‌లో ప్రజల సేవలు చేస్తానన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ దేశంలోని పలు రాష్ట్రాల్లో తిరుగుతూ గోషామహల్‌లో ఏనాడు తిరుగలేదని ఆయన అన్నారు.

గోషామహల్‌లో కాంగ్రెస్‌దే విజయం



అబిడ్స్: గోషామహల్‌లో కాంగ్రెస్ పార్టీదే విజయమని పార్టీ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. బేగంబజార్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. అనంతరం మొగిలి సునీతారావు మాట్లాడుతూ..బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేసేందుకు కుట్రపన్నాయన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని ఆమె అన్నారు. గోషామహల్‌లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.